సాక్షి ప్రకాశం

శనివారం । 14 । డిసెంబర్ । 2024



స్నేహితుడే కాలయముడు

ప్రియుడు మోజులో పడి ఏడాదిన్నర క్రితం భర్తను భార్య హత్య చేసింది. ప్రియుడితో సహజీవనం చేస్తూ విభేదాలు తలెత్తి అతని చేతిలోనే వారం క్రితం హత్యకు గురైంది. - 8లో..



చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
28/25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
పొగమంచు కురుస్తుంది.
చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పశుగ్రాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి



రైతులతో మాట్లాడుతున్న జేడీ డాక్టర్ బేబీరాణి

నాగులుప్పలపాడు: నూరు శాతం రాయితీపై పశుగ్రాసం అందజేస్తున్న పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి కోరారు. నాగులుప్పలపాడు మండలంలోని కనపర్తి గ్రామంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పూర్తి సబ్సిడీతో పశుగ్రాసం అందజేసే ఈ పథకం పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి రైతు 10 సెంట్లు, 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుచేసుకోవచ్చన్నారు. అందుకు సంబంధించి జాబ్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ కలిగి ఉండాలని, బోరు లేదా నీటి వసతి ఉండాలని సూచించారు. 50 సెంట్లలో సాగుచేసేవారికి రూ.32,992, 40 సెంట్లకు రూ.26,394, 30 సెంట్లకు రూ.19,795, 20 సెంట్లకు రూ.13,197, 10 సెంట్లకు రూ.6,599 ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం పశుగణన, గోకులం షెడ్లను జేడీ బేబీరాణి పరిశీలించారు. కార్యక్రమంలో అమ్మనబ్రోలు పశువైద్యశాల వైద్యాధికారిణి వెంకటసురేఖ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజు విజయపాల్ విచారణ పూర్తి



విచారణ తర్వాత ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్ లోపలికి విజయపాల్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామరాజు కస్టడీకి సంబంధించిన కేసులో అరెస్టయిన సీఐడీ మాజీ ఏఎస్పీ విజయపాల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం ఒంగోలు తరలించారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి 2 గంటలకు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట విచారణకు హాజరుపరిచారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవనంలో సాయంత్రం 7 గంటల వరకు సుమారు 5 గంటల పాటు ఆయనను విచారించారు. ఎస్పీ దామోదర్‌తో పాటు ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, సీఐలు విచారణలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, గత నెల 13వ తేదీ ఆయన తొలిసారిగా విచారణకు ఒంగోలు వచ్చారు. ఆ తర్వాత రెండోసారి 26వ తేదీ విచారణకు వచ్చిన ఆయనను రాత్రి 9 గంటల ప్రాంతంలో అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. తాజాగా కస్టడీలోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు విచారణ చేయనున్నారు. తొలిరోజు విచారణ తర్వాత ఆయనను తాలూకా పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రైతు కోసం ఎందాకైనా..

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాతకు అండగా ర్యాలీ

చంద్రబాబు సర్కార్ మోసాలపై ఆగ్రహం

- అన్నదాత వెన్నెముక విరిచిన కూటమి ప్రభుత్వం
- రైతులు ఆత్మాభిమానంతో బతికేలా జగనన్న పాలన కొనసాగింది
- తప్పుడు హామీలతో అధికారంలోకి చంద్రబాబు
- రైతులకు సహాయం చేయకపోగా దగా చేస్తున్నారు
- అన్నం పెట్టే రైతులకు సున్నం పెడుతున్నారు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ధ్వజం



ర్యాలీలో పాల్గొన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఆదిమూలపు సురేష్, అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు, కొమ్మూరి కనకారావుమాదిగ, కాకుమాను రాజశేఖర్, దద్దాల నారాయణయాదవ్, కుప్పం ప్రసాద్, చుండూరి రవిబాబు, తదితరులు



రైతులకు మద్దతుగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం పరిపాలన చేస్తోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన అన్నదాతకు అండగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో చినఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసి అన్నదాతల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు వినతిపత్రం ఇవ్వడానికి వస్తే కలెక్టర్ అందుబాటులో లేకుండా పోయారన్నారు. కనీసం జాయింట్ కలెక్టర్ కూడా కార్యాలయంలో లేకపోవడం ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతోందని ఆరోపించారు. జిల్లాలోని రైతులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా ప్రథమ పౌరురాలు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ స్వయంగా కలెక్టర్ కార్యాలయానికి వస్తే అధికారులెవరూ ఉండకపోవడం సిగ్గుచేటంటూ చెవిరెడ్డి మండిపడ్డారు. మేమేమీ ధర్నాలు చేయడానికి రాలేదని, ఆందోళన చేయడానికి రాలేదని, కేవలం అన్నదాతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకే కలెక్టర్ కార్యాలయానికి వచ్చామని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, తద్వారా వారికి న్యాయం చేయాలని అడిగేందుకు మాత్రమే వచ్చామన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఐదేళ్లు రైతు రాజ్యం నడిచిందని, జగనన్న హయాంలో ఐదేళ్లు రైతే రాజులా రాష్ట్రాన్ని పరిపాలించారని గుర్తుచేశారు. రాష్ట్రానికి రైతే వెన్నెముక అని భావించిన జగనన్న.. ఎరువులు, విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించారన్నారు. రైతు భరోసా ద్వారా అనేక సంక్షేమ పథకాలు చేపట్టి ఆదుకున్నారని తెలిపారు. రైతు ఆత్మాభిమానంతో బతికేలా జగనన్న పాలన కొనసాగిందన్నారు. దీనికి విరుద్ధంగా చంద్రబాబు రైతుల వెన్నెముక విరిచేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తాం, రూ.30 వేలు ఇస్తామంటూ చంద్రబాబు తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారని ధ్వజమెత్తారు. ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ కనీసం ఒక్క రూపాయి కూడా రైతులకు సహాయం చేయకుండా దగా చేశారని మండిపడ్డారు. ఇప్పుడు రైతులు మా జీవితాలను నాశనం చేయొద్దని చంద్రబాబును వేడుకుంటున్నారన్నారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు వైఎస్సార్ సీపీ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని చెవిరెడ్డి స్పష్టం చేశారు.



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కలెక్టరేట్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఆదిమూలపు సురేష్, అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు, కొమ్మూరి కనకారావుమాదిగ, కాకుమాను రాజశేఖర్, చుండూరి రవిబాబు, వైఎం ప్రసాద్

రైతులను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం : మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులను గాలికొదిలేసిందని, రైతు కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. గత ఆరు నెలల కాలంలో రాష్ట్రంలో ఎంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారో కూటమి పాలకులు చెప్పాలని నిలదీశారు. జగనన్న పాలనలో రైతులకు పంటల బీమా పథకానికి ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో రైతులే ఆ భారాన్ని మోయాల్సి వస్తోందన్నారు. వాట్సాప్‌లో హాయ్ అని పెడితే క్షణాల్లో మీ ఎదురుగా వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామని చంద్రబాబు చెప్పారని, ఇప్పుడు వాట్సాప్‌లో హలో అని పెట్టినా పలకరించే దిక్కే లేదని ఎద్దేవా చేశారు. కూటమిపై రైతులు పెట్టుకున్న ఆశలు ఆడియాశలయ్యాయని విమర్శించారు. ఖరీఫ్, రబీ సీజన్లు వెళ్లిపోయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని విమర్శించారు. జగనన్న పాలనలో రైతులకు ఏడాదికి రూ.13,500 ఇస్తుంటే.. తాము అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి ఇప్పుడు మొహం చాటేశారన్నారు. 2014లో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టినట్లే.. ఇప్పుడు కూడా మోసానికి పాల్పడుతున్నారని విమర్శించారు. అన్నదాతల ఆవేదనను చెప్పుకునేందుకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కలెక్టర్ కార్యాలయానికి వస్తే ఉన్నతాధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఇలాగే రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఇలాగైతే ఇళ్లను ముట్టడిస్తాం : వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు

రైతుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వస్తే అధికారులంతా కలెక్టరేట్ వదిలి పారిపోయారని, ఇలాగైతే మీ ఇళ్లను ముట్టడిస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు హెచ్చరించారు. అధికారులు అధికారపార్టీతో అంటకాగుతున్నారని, ప్రతిపక్షం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బంగ్లాదేశ్, శ్రీలంక, సిరియా అధ్యక్షులు పారిపోయారని, అలాంటి దుస్థితి రాష్ట్రంలో తెచ్చుకోవద్దని హెచ్చరించారు. చంద్రబాబు ఏనాడూ రైతులకు అనుకూలంగా ప్రవర్తించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకుమాను రాజశేఖర్, ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, లీగల్ సెల్ జిల్లా ప్రెసిడెంట్ స్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, ప్రకాశం జిల్లా అగ్రికల్చర్ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి, బూచేపల్లి, ఆదిమూలపు, తాటిపర్తి తదితరులు

రైతు సంక్షేమాన్ని అటకెక్కించారు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని అటకెక్కించి వారి నోట్లో మట్టికొట్టిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. రైతుల కోసం అండగా పోరాటం చేసేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు తరలివచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న అన్యాయాలను ఎదుర్కొంటామన్నారు. ఎన్నికలకు ముందు రకరకాల మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు సెంటర్లు లేకుండా చేశారని, దళారులు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై అన్నదాతల వెన్ను విరుస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆర్బీకేల పేర్లు మార్చడం తప్ప చేసిందేమీ లేదన్నారు. జగనన్న ప్రభుత్వం అనేక రకాల సబ్సిడీలిచ్చి అన్నదాతలను ఆదుకుంటే నేటి పాలకులు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. జగనన్న పాలనలో ధాన్యం ధర రూ.1,750 ఉండగా, ఇప్పుడు అనేక సాకులు చెప్పి అరకొరగా చేతుల్లో పెడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు రైతులను మళ్లీ మోసం చేస్తున్నారని చెప్పారు.

రైతు సంపదను ఆవిరి చేస్తున్నారు : యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

అన్నం పెట్టే రైతులకు కూటమి ప్రభుత్వం సున్నం పెడుతోందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. దళారులు రైతు సంపదను ఆవిరిచేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు ఇచ్చే రుణాలు, బీమా, రూ.20 వేలు ఆసరాను చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు రైతు సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి వస్తే కార్యాలయంలో కలెక్టరు అందుబాటులో లేకుండా పోవడం బాధ్యతారాహిత్యం కాక మరేమిటని ప్రశ్నించారు. జగనన్న పాలనలో గతేడాది ఇదే సమయంలో పత్తి క్వింటా ధర రూ.6,500 ఉండగా, ఇవాళ కేవలం రూ.4000 మాత్రమే ఉందన్నారు. టమోటా కిలో ఒక్క రూపాయికి కూడా కొనేనాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. అదే టమోటాను చంద్రబాబుకు చెందిన హెరిటేజ్‌లో కిలో రూ.50కి అమ్ముతూ ప్రజల జేబులు కొల్లగొడుతున్నారని విమర్శించారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా పోయాయని, దళారుల ద్వారా అన్ని రకాల పంటల ధరలు దిగివచ్చేలా కూటమి కుతంత్రాలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే ఆరోపించారు. రైతులంతా వైఎస్సార్ సీపీ పక్షాన నిలబడ్డారనే కక్షతో నీటి సంఘాల ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతులను దగా చేస్తే భవిష్యత్ ఉండదని హెచ్చరించారు.

జర్నలిస్టులపై దాడి అనాగరికం



మార్కాపురంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పాత్రికేయులు

- నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి
- ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రమణ డిమాండ్



జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

మార్కాపురం రూరల్: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలంలో వార్తల కవరేజీ కోసం వెళ్లిన సాక్షి రిపోర్టర్లపై దాడి చేయడం అనాగరికమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ ఖండించారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో టీవీ 9 ప్రతినిధిపై, తాజాగా పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలంలో సాక్షి ప్రతినిధులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ మార్కాపురంలోని ప్రెస్ క్లబ్ వద్ద నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో రమణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా వ్యవస్థపై ఇటీవల దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చని అన్నారు. జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితులపై హత్యాయత్నంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు మూలా అల్లారెడ్డి, యూనియన్ జిల్లా కోశాధికారి డి బాబీ, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాజీవలి, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌కే అబ్దుల్లా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎం.పవన్, వి.రాజు, మల్లికార్జున, ఎస్‌కే రఫీ, ఎస్‌కే మస్తాన్, రాజ్‌కమల్, శేఖర్, శ్రీధర్, సాయి సుబ్బారావు, యోగి, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి జర్నలిస్టులపై దాడిచేసిన గూండాలను అరెస్టు చేయాలి...

మార్కాపురం: వేముల తహసీల్దార్ కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికల వార్తల కవరేజీకి వెళ్లిన సాక్షి టీవీ రిపోర్టర్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రికా రిపోర్టర్ రాజారెడ్డిపై కొందరు గూండాలు మూకుమ్మడిగా దాడిచేసి గాయపరచడాన్ని జర్నలిస్టు అసోషియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) జిల్లా ప్రధాన కార్యదర్శి కాళంరాజు రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. జర్నలిస్టులపై దాడి చేయడమే కాకుండా వారి కెమెరాలు, సెల్‌ఫోన్లను లాక్కుని పగలగొట్టడాన్ని తీవ్రంగా పరిగణించి వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని రామకృష్ణ కోరారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నిక

- 342 సంఘాలు, 2,12,909 మంది ఓటర్లు
- అధికారానికి అధికారుల జీ హుజూర్
- సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికార పక్షం తొండాట
- టీడీపీ నేతలను ఏకగ్రీవం చేసే కుట్రలో పావులుగా అధికారులు

ఒంగోలు అర్బన్: జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో నేడు జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నిక జరగనుంది. మేజర్, మీడియం, మైనర్‌ప్రాజెక్టులకు సంబంధించి మొత్తం 342 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల్లో మొత్తం 2,12,909 మంది ఓటర్లు సంఘాలను ఎన్నుకోనున్నారు. ఉదయం 8గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ప్రక్రియ ముగుస్తుందని అధికారులు తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో 342 సంఘాలకు సంబంధించి 342మంది ఎలక్షన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారులతో పాటు 886మంది పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులను నియమించారు. జిల్లాలో మేజర్ ప్రాజెక్టులకు సంబంధించి నాగార్జున సాగర్, కృష్ణ వెస్టన్ డెల్టా ప్రాజెక్టులకు సంబంధించి 88 సంఘాలు ఉండగా మీడియం ప్రాజెక్టులకు సంబంధించి కంభం ట్యాంక్ 5, మోపాడు రిజర్వాయర్ 4, పాలేరు బిట్రగుంట ఆనికట్టు 5 సంగాలు ఉండగా మైనర్ ఇరిగేషన్ ట్యాంక్స్ క్రింద 240 సంఘాలకు ఎన్నికల జరగనుంది. ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పురుష ఓటర్లు 1,51,380మంది, మహిళా ఓటర్లు 61,529మంది ఉన్నారు.

నో డ్యూ సర్టిఫికెట్లు టీడీపీ సానుభూతిపరులకే..

సాక్షి నెట్‌వర్క్: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో కిరికిరి చేసేందుకు అధికార కూటమి పార్టీల నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలన్న ఉద్దేశంతో కుట్రలకు తెరలేపి అందులో అధికారులను పావులుగా మార్చారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. కూటమి నేతలతో కొందరు అధికారులు అంటకాగుతూ వారు చెప్పిన విధంగా తలాడిస్తుండగా, వారి మాట మీరితే బదిలీల పేరుతో వేధిస్తారన్న భయంతో కొందరు సిబ్బంది పనిచేస్తున్నారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. శనివారం సాగు నీటి సంఘాల ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు అవసరమైన నో డ్యూ సర్టిఫికెట్లు, నీటి పన్ను రశీదులు ఇవ్వడంలో అధికారులు వివక్ష చూపిస్తుండటంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. అధికార కూటమి నేతలకు అన్ని పత్రాలు ఇచ్చిన అధికారులు.. వారికి పోటీ లేకుండా చేయాలనే కుట్రలో భాగంగా ఇతర అభ్యర్థులకు ఏ సమాచారం తెలియజేయడం లేదు.



కొనకనమిట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎంపీపీ, తదితరులు

- కొనకనమిట్ల మండలంలో వాగుమడుగు, అంబాపురం, వద్దిమడుగు, తువ్వపాడు, చినారికట్ల, పెదారికట్లకు చెందిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులు నో డ్యూ సరిఫికెట్ల కోసం తహసీల్దార్ సురేష్‌ను సంప్రదించడగా డీటీని కలవాలని సూచించారు. డీటీని అడిగితే వీఆర్వోను కలవాలని, వీఆర్వోను సంప్రదిస్తే మళ్లీ తహసీల్దార్‌నే కలవాలని డబుల్ గేమ్ ఆడటం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు తాము ప్రభుత్వ ఉద్యోగులమన్న సంగతి మరిచి ప్రవర్తిస్తున్నారని పలువురు అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరును నిరసిస్తూ శనివారం ఆయా గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని వైఎస్సార్‌సీపీ నేతలతోపాటు స్వచ్ఛంద అభ్యర్థులు తెలిపారు.
- తర్లుపాడు మండలంలో నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశంతో వీఆర్వోలు సచివాలయాల్లో పరిసరాల్లోకి కూడా రాలేదు. అదే సమయంలో టీడీపీ నాయకులను మాత్రం ఓ చోటకు పిలిపించి మరీ సర్టిఫికెట్లు అందజేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ మండలంలో నిర్వహించే 3 సంఘాల ఎన్నికల్లో ఎవరు గెలుపొందాలో ఎమ్మెల్యే ముందుగానే నిర్ణయించినట్లు స్థానికంగా ప్రచారం సాగుతోంది.
- 'ఏ సంఘానికి ఎన్ని ఓట్లు ఉన్నాయో కూడా తెలియదు. ఏ పనికి ఆ పని జరిగిపోతుంది' అని మర్రిపూడి తహసీల్దార్ నరసింహారావు పేర్కనడం ఇక్కడ ఎన్నికలు ఎలా సాగబోతున్నాయో చెప్పకనే చెప్పినట్టయింది. ఈ మండలంలో ఎక్కడా కనీసం దండోరా వేయించలేదు. ఓటర్లకు స్లిప్పులు పంచలేదు.

పదినెలల బాలుడు కిడ్నాప్

- ఒంగోలు ప్రగతికాలనీలో కలకలం
- స్నేహంగా ఉంటూ దయామణి అనే మహిళ తమ బిడ్డను ఎత్తుకెళ్లిందని తల్లిదండ్రుల ఫిర్యాదు

ఒంగోలు టౌన్: నగరంలో పదినెలల పసిబాలుడు కిడ్నాప్ ఘటన శుక్రవారం సంచలనం సృష్టించింది. బాధితుల కథనం ప్రకారం.. ఒడిశాలోని జ్వార్గూడకు చెందిన ప్రదీప్ సునాని, ఊర్వశీ సునానికి నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. వారికి పది నెలల బాబు మహిర్ ఉన్నాడు. మూడేళ్లుగా ఒంగోలులోని కార్‌కేర్‌లో పనిచేస్తున్న ప్రదీప్.. మూడు నెలల క్రితం నగరంలోని ప్రగతికాలనీ మొదటి లైనులో ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఇటీవల పక్కింటిలో పనిచేయడానికి వస్తున్న దయామణి అనే మహిళ ఊర్వశికి పరిచయమైంది. తరచూ ఇంటికి వచ్చి బాబును ఎత్తుకుని ఆడించేది. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో బాలుడు మహిర్ నిద్రపోతుండగా తల్లి ఊర్వశి స్నానం చేసేందుకు వెళ్లింది. అదే అదునుగా భావించిన దయామణి ఇంట్లో నిద్రపోతున్న బాలుడిని ఎత్తుకెళ్లింది. స్నానం చేసి వచ్చిన ఊర్వశి ఇంట్లో బిడ్డ లేకపోవడంతో ఆందోళనకు గురైంది. చుట్టుపక్కల వెతికినా బాబు కనిపించలేదు. దయామణి ఒక్కతే వచ్చివెళ్లడంతో ఆమెపై అనుమానంతో ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో ప్రదీప్, ఊర్వశి దంపతులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న తాలూకా పోలీసులు వెంటనే రంగంలోకి దిగి సీసీ కెమేరాలను పరిశీలించారు. నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన మణికంఠతో కలిసి బాలుడిని దయామణి ఎత్తుకెళ్తున్న దృశ్యాలు రైల్వే స్టేషన్లో కనిపించినట్లు సమాచారం. మణికంఠతో దయామణి సహజీవనం చేస్తున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశామని, సీసీ కెమేరాలను పరిశీలిస్తున్నామని ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. బాలుడి చిత్రాలను, అనుమానితురాలు దయామణి చిత్రాలను సోషల్ మీడియాలో పెట్టి గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.



మహిర్

క్లుప్తంగా

రేపు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: కబడ్డీ జూనియర్ విభాగం బాలబాలికల జిల్లా జట్లను ఈ నెల 15వ తేదీ ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురు 70 కేజీలలోపు, బాలికలు 65 కేజీలలోపు ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. వీరంతా తప్పనిసరిగా 2005 తర్వాత జన్మించి ఉండాలన్నారు. బాలురకు బాపట్ల జిల్లా చినగంజాంలోని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో, బాలికలకు పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు మ్యాట్‌పై ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే 50వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు బాలురు ఎం.గిరిబాబు (9700600996)ను, బాలికలు పి.హజరత్తయ్య (9848606573)ను సంప్రదించాలని సూచించారు.

రేపు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలు

పెద్దారవీడు: మండలంలో దేవరాజుగట్టు గ్రామంలో సమర్థ సద్గురు కాశినాయన స్వామి 29వ ఆరాధన మహోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి పెద్దసైజు బండలాగు ఎడ్ల పందెం ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ప్రథమ బహుమతి రూ.60,116, ద్వితీయ బహుమతి రూ.50,116, తృతీయ బహుమతి రూ.40,116, నాలుగోబహుమతి రూ.30,116, ఐదో బహుమతి రూ.20,116, ఆరో బహుమతి రూ.10,116 అందజేస్తున్నట్లు దాతలు ప్రకటించారు. పేర్ల నమోదుకు ఎడ్ల యజమానులు గుంటక పాపిరెడ్డి 9642186379, గొట్టం సూర్యనారాయణరెడ్డి 9989738984ని సంప్రదించాలని సూచించారు.

మంత్రిగారొస్తున్నారు.. మొదలెట్టండి!




రోడ్డు ప్యాచ్‌వర్క్ పరిశీలిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని కోనపల్లె ఆర్అండ్‌బీ రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వస్తున్నారని హడావుడిగా ప్రారంభించారు. మంత్రి బేస్తవారిపేట మీదుగా వెళ్తున్నారని తెలియడంతో మెప్పు పొందేందుకు ఆగమేఘాలపై పనులు చేపట్టడం గమనార్హం. జిల్లాలో రూ.21 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

రేపటి నుంచి ఏఎస్ఈఆర్ సర్వే

ఒంగోలు సిటీ: ఏపీ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిపోర్టు(ఏ.ఎస్.ఈ.ఆర్) సర్వేను మైనంపాడు డైట్‌లోని ట్రైనీ టీచర్స్ ఈ నెల 15, 16, 17వ తేదీల్లో నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎంపిక చేసిన 30 గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక్కో గ్రామానికి ఇద్దరు చొప్పున పాల్గొంటారని, ఒక పాఠశాల, 20 ఇళ్లను సర్వే చేస్తారని వివరించారు. సర్వే చేస్తున్న ట్రైనీ టీచర్లకు గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఈ సర్వే ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయిలో 3 నుంచి 16 ఏళ్ల పిల్లల పాఠశాల నమోదు స్థితి, ప్రాథమిక పఠనం, గణిత పరిజ్ఞానం స్థాయిని తెలుసుకోనున్నారు.

ఎరువుల దుకాణంపై 6ఏ కేసు



స్టాకు పరిశీలిస్తున్న అధికారులు

పొదిలి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం ఒంగోలు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. శ్రీసాయి కృష్ణ ట్రేడర్స్ గోడౌన్‌లో ఉన్న నిల్వలకు, రికార్డులకు రూ.2,21,000 విలువైన 5 టన్నుల ఎరువుల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. స్టాక్ బోర్డు అప్‌డేట్ చేయనందున, ధరల పట్టిక చూపనందున సదరు దుకాణ యజమానిపై కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. అలాగే శ్రీహరిత సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ దుకాణంలో పురుగు మందుల నిల్వలకు సంబంధించి సరైన పత్రాలు లేనందున వాటి విక్రయాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ వీఎస్ పాల్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.చిరంజీవి, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడే కాలయముడు!

- ప్రియుడి మోజులో పడి ఏడాదిన్నర క్రితం భర్తను చంపిన భార్య
- సహజీవనం చేస్తున్న క్రమంలో ప్రియుడితో విభేదాలు
- వారం క్రితం ప్రియురాలిని కత్తితో పొడిచి చంపిన ప్రియుడు

గిద్దలూరు రూరల్:

ఓ మహిళ కట్టుకున్న భర్తను పథకం ప్రకారం హత్య చేసి, ఆపై ఆ ప్రియుడి చేతిలోనే హతమైందని మార్కాపురం డీఎస్పీ యు.నాగారాజు పేర్కొన్నారు. అక్రమ సంబంధం రెండు నిండు ప్రాణాలను బలిగొనడమే కాకుండా మరొకరి జీవితం జైలు పాలయ్యేలా చేసిందని చెప్పారు. ఈ నెల 6వ తేదీన గిద్దలూరులోని చాకలివీధిలో పాకి సుభాషిణి అనే మహిళ ఆమె ప్రియుడు అంబడిదాసు శ్రీకర్ అలియాస్ నాని చేతిలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. నిందితుడు శ్రీకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మరుగునపడిన మరో హత్య కేసు వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు.

కంభం మండలం నర్సిరెడ్డిపల్లెకు చెందిన పాకి బాలక్రిష్ణ(31)కు రాచర్లకు చెందిన సుభాషిణిని ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వీరికి లోకిత, రోహిత్ అనే ఇద్దరు చిన్నపిల్లలున్నారు. బాలకృష్ణ కుటుంబంతో సహా గిద్దలూరులోని రాచర్ల రోడ్డులో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో సుభాషిణికి తనతో కలిసి పదో తరగతి వరకు చదువుకున్న రాచర్లకు చెందిన నాని తారసపడ్డాడు. గిద్దలూరులో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న నాని.. సుభాషిణి ఫోన్ నంబర్ తీసుకుని తరుచూ మాట్లాడేవాడు. ఈ క్రమంలో పాత పరిచయం కాస్తా అక్రమ సంబంధంగా మార్చుకున్నారు. ఈ వ్యవహారం బాలకృష్ణకు తెలియడంతో సుభాషిణిని మందలించాడు. భార్య చేస్తున్న మోసాన్ని జీర్ణించుకోలేక మద్యం తాగి చిత్రహింసలకు గురిచేస్తుండేవాడు. దీంతో భర్తను అడ్డుతొలగించాలని భావించిన సుభాషిణి తన స్నేహితుడు నానితో కలిసి పథకం రచించింది. 2023 ఏప్రిల్ 4వ తేదీన మజ్జిగలో నిద్ర మాత్రలు కలిపి భర్తతో తాగించింది. మత్తులోకి జారుకున్నట్లు నిర్ధారించుకున్న తర్వాత నానితో కలిసి బాలకృష్ణ ముఖానికి గుడ్డకట్టి, గొంతుకు తాడు బిగించి చంపారు. ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన సుభాషిణి బంధువులను నమ్మించి దహన సంస్కారాలు పూర్తి చేసింది. బాలకృష్ణ మద్యానికి బానిసై ఉరివేసుకుని చనిపోయి ఉంటాడని అంతా భావించారు. బాలకృష్ణ పెద్ద కర్మ అయిన వెంటనే సుభాషిణి తన ప్రియుడు నానితో కలిసి హైదరబాద్‌కు మకాం మార్చింది. అక్కడ సహజీవనం సాగిస్తున్న క్రమంలో వారి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో సుభాషిణి తిరిగి గిద్దలూరు చేరుకుని ఓ రెడీమెడ్ షాపులో పనిచేసుకుంటూ జీవిస్తోంది. అయితే నాని తనతో మళ్లీ మాట్లాడాలంటూ తరుచూ సుభాషిణిపై ఒత్తిడి చేస్తున్నాడు. ఆమె పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టడంతో నానిని మందలించారు. ప్రియురాలు దూరం పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోయిన నాని ఆమెపై కక్ష పెంచుకుని కత్తితో గాయపరచగా ఆమె మార్కాపురం వైద్యశాలలో మృతి చెందిందని డీఎస్పీ వివరించారు. కేసును ఛేదించిన సీఐలు కె.సురేష్, రామకోటయ్య, ఎస్సై ఇమ్మానియేల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.




నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు



పోలీసులు రికవరీ చేసిన బంగారు, వెండి నగలు

- రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు

కంభం: మండలంలోని సూరేపల్లిలో గత నెలలో జరిగిన చోరీ కేసులో దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. గత నెల 28వ తేదీన సూరేపల్లి గ్రామంలో ఓ గృహంలో చోరీ జరిగిన నేపథ్యంలో బాధితుడు గాలేటి వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ కె. మల్లికార్జున, ఎస్సై బి. నరసింహారావు ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మార్కాపురం మండలం భూపతి పల్లి గ్రామానికి చెందిన వెన్నా ఈశ్వర రెడ్డి అనే వ్యక్తిని జంగంగుంట్ల వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా చోరీలకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చిందన్నారు. అతని వద్ద నుండి సూరేపల్లి గ్రామంలోని ఇంట్లో దొంగిలించిన 51 బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుతో పాటు తర్లుపాడు మండలం గోరుగుంతలపాడులో జరిగిన చోరీలోనూ ఇతనే నిందితుడని, ఆ కేసుకు సంబంధించి 9.72 గ్రాముల బంగారు ఆభరణాలు, 165 గ్రాముల వెండీ పట్టీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సూరేపల్లి చోరీలో సొత్తును విలాసాలాకు వాడుకున్నట్లు తెలిపారు. నిందుతుడిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. కేసులో కీలకంగా వ్యవహరించిన ఎస్సై నరసింహారావు, కానిస్టేబుళ్లు కాటంరాజు, బషీర్, ఆనంద్ కుమార్, రమేష్, హోంగార్డ్స్ మస్తాన్, గురుస్వామి, లాజర్, యేసులను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- రిటైర్డ్ పోస్టుమాస్టర్‌కు తీవ్ర గాయాలు



ఒంగోలులో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు.

మర్రిపూడి: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నడంతో రిటైర్డ్ పోస్టుమాస్టర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుండ్లసముద్రం సమీపంలోని టంగుటూరు–పొదిలి ఆర్అండ్‌బీ రహదారిపై గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్టుమాస్టర్ మారెడ్డి వెంకటేశ్వర్లు తన ఇంటి నుంచి పొదిలికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మండలంలోని తంగెళ్ల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కారుడ్రైవర్ షేక్ బాషా మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై పొదిలి నుంచి మర్రిపూడి వైపు బయలుదేరాడు. గుండ్లసముద్రం గ్రామశివారులోని గ్రౌండ్‌ఫ్లోర్ ట్యాంక్ సమీపంలోకి వచ్చిన వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనాన్ని బాషా బలంగా ఢీకొట్టాడు. దీంతో వెంకటేశ్వర్లు రోడ్‌పై పడిపోయాడు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న కారుడ్రైవర్ షేక్ బాషా పరారయ్యాడు. సమీప వాహనాదారులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రున్ని ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనలో విశ్రాంత పోస్టుమాస్టర్ వెంకటేశ్వర్లు కుడికాలు, వేళ్లు విరిగిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్ వైద్యశాలకు తరలించారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

- ఐసీడీఎస్ పీడీ హేన సుజన్



బాలసదనం సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న పీడీ హేనసుజన్

ఒంగోలు సిటీ: బాలసదనంలోని ఖాళీ ప్రదేశంలో న్యూట్రిగార్డెన్ కింద ఆకుకూరలు పెంచి బాలసదనంలోని పిల్లలకు పోషకాహారంగా అందించాలని ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ అన్నారు. ఒంగోలులోని బాలసదనం, శిశుగృహను శుక్రవారం సందర్శించి అక్కడ పనిచేస్తున్న అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ హేనసుజన్ మాట్లాడుతూ దత్తత ప్రక్రియ వేగంగా ఉండాలని సూచించారు. శిశుగృహలోని పిల్లలకు చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలకు ఏమైనా ఆరోగ్యం బాగా లేకపోతే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి వారిని చూపించాలని, పిల్లల పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, ఆడపిల్లలకి నెలకొకసారి బుతుక్రమంకు సంబంధించి శానిటరీ ఫాడ్‌లు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, బాలసదనం సూపరింటెండెంట్ డి.జీవిత, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు లేకుండా పాంక్రియాటిక్ ఆపరేషన్

- అరవింద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల ఘనత



పాంక్రియాటిక్ ఆపరేషన్ చేసిన అరవింద వైద్యుల బృందంతో డాక్టర్ నరేంద్ర

ఒంగోలు టౌన్: నగరంలోని అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి ఒక రోగి ప్రాణాలు కాపాడారు. వల్లూరు గ్రామానికి చెందిన 35 ఏళ్ల యువకుడు గత కొన్నాళ్లుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. వారం రోజుల క్రితం నగరంలోని ఎన్జీఓ కాలనీలో గల అరవింద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ మండలపు నరేంద్ర బాబు దగ్గరకు చికిత్స కోసం వచ్చారు. వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన ఆయన రోగి పాంక్రియాసిస్‌లో చీము పట్టినట్లు గుర్తించారు. సహజంగా అయితే దీనికి ఆపరేషన్ చేస్తే చాలా కుట్లు పడతాయి. కానీ దానికి భిన్నంగా అధునాతన పద్ధతిలో ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్‌ను ఉపయోగించి స్టెంట్ వేసి చీము మొత్తం తీసేశారు. ఈ వైద్య ప్రక్రియ తర్వాత కడుపునొప్పి పూర్తిగా తగ్గిపోవడంతో రోగి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మూడు రోజులకే కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ఈ వైద్య చికిత్సలో ఎలాంటి కుట్టు కాని, కోత కానీ లేకపోవడం వలన రోగికి రక్త స్రావం లాంటి సమస్యలు ఉండవని ఆసుపత్రి నిర్వాహకులు డా.నరేంద్ర బాబు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ తరహా వైద్య చికిత్స జిల్లాలో ఇదే తొలి సారని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డా.వెంకటేష్, డా.బ్రహ్మేశ్వరరావు, డా.భానుతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ప్రత్యేక ప్రశంసలు

ఒంగోలు అర్బన్: ప్రకాశం జిల్లా విజన్ డాక్యుమెంట్–2047కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు ప్రత్యేక ప్రశంస లభించింది. దీనికి గాను రెండో స్థానం లభించింది. గత రెండు రోజులుగా ముఖ్యమంత్రి నిర్వహించిన సదస్సులో కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా అభివృద్ధికి సంబంధించి రంగాల వారీగా రూపొందించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను వివరించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ ఓబులేసు ఇతర జిల్లా అధికారులు కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

2 సెం.మీ పైకి లేచిన రాళ్లపాడు గేటు



రాళ్లపాడు కుడి కాలువ గేటును పైకి లేపేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ గేటును బయటకు తీసే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం రెండు సెంటీమీటర్లు పైకి లేచినట్లు డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. ఆరో రోజు అధికారులు గేటును పైకి లేపేందుకు ప్రయత్నించగా రెండు సెంటీమీటర్లు పైకి లేచిన తర్వాత చైన్‌బ్లాక్ లింకులు, వాటికి బిగించిన రోప్‌లు తెగిపోయాయి. అధికారులతోపాటు ప్రైవేట్ మెకానిక్ బాషా, సిబ్బంది, వైజాగ్ నుంచి వచ్చిన టెక్నీషియన్లు సాయంత్రం వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చీకటి పడటంతో పనులను నిలిపివేసినట్లు డీఈ చెప్పారు. గేటు కాస్త పైకి లేచినపుడు 60 క్యూసెక్కుల నీరు కాలువకు విడుదలైనట్లు తెలిపారు. శనివారం కూడా గేటును పైకి లేపేందుకు ప్రయత్నిస్తామన్నారు.

సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలేశారు

- కార్పొరేట్ల మేలు కోసమే జమిలి ఎన్నికలు
- యువగళంలో స్మార్ట్‌మీటర్లు పగలగొట్టమన్న లోకేష్. అధికారంలోకి వచ్చాక వాటినే బిగిస్తున్నారు
- సీపీఎం జిల్లా మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ధ్వజం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

చీమకుర్తి: సూపర్ సిక్స్ అమలు గాలికొదిలేశారని, మెగా డీఎస్సీపై తొలి సంతకం తప్ప ఫైలు ముందుకు కదిలింది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రకృతి వనరులను అదానీకి కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం 14వ జిల్లా మహాసభలను శుక్రవారం చీమకుర్తిలో ప్రారంభించగా, శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అదానీ అవినీతి ప్రపంచాన్ని కుదిపేస్తోందని, భారత ప్రతిష్టను అమెరికాలో తాకట్టు పెట్టారని ఎండగట్టారు. పోర్టులు, వేలాది ఎకరాల భూములు అదానీ పరమయ్యాయన్నారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకే ప్రధాని మోదీ జమిలి ఎన్నికలు తీసుకొస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు యువగళంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తే వాటిని పగలగొట్టమని రైతులకు సలహా ఇచ్చిన నారా లోకేష్.. తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు బిగించమని చెప్పడం అతని ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. ఇప్పుడు ఇంటికొక ఉద్యోగం అంటూ చేస్తున్న నినాదం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయడమేనని టీడీపీ పాలనపై శ్రీనివాసరావు మండిపడ్డారు. తొలుత ఎన్ఎస్‌పీ కాలనీ నుంచి సీపీఎం శ్రేణులు ర్యాలీగా బూచేపల్లి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. మధ్యలో రోడ్లపై మహిళలతో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, కే ఉమామహేశ్వరరావు, పూనాటి అంజనేయులు, మాబు, కొండారెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసరావు, పమిడి వెంకట్రావు, కాలం సుబ్బారావు, ఏ మాల్యాద్రి, జాలా అంజయ్య, పూసపాటి వెంకట్రావు, వై.సిద్దయ్య, పల్లాపల్లి ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక



బాక్సింగ్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులు

ఒంగోలు: బాక్సింగ్ జిల్లా స్థాయి పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలను శుక్రవారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియను ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు లెమ్యూల్ రాజు, బాక్సింగ్ కోచ్ వేణు ప్రారంభించారు. ఎంపికైన వారు ఈ నెల 19, 20వ తేదీల్లో కాకినాడ సమీపంలోని పిఠాపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

55 కేజీల విభాగంలో ఒ.ఆశిఫ్, 60 కేజీల విభాగంలో పి.రమేష్, 65 కేజీల విభాగంలో బి.ఏడుకొండలు, 70 కేజీల విభాగంలో పి.కిషోర్, 75 కేజీల విభాగంలో డి.గణేష్, 80 కేజీల విభాగంలో కె.వంశీకృష్ణ, 85 కేజీల విభాగంలో ఐ.జస్వంత్, 90 కేజీల విభాగంలో ఎ.రామస్వామికి సర్టిఫికెట్లు అందించారు.